చూడటం, కొంతమందికి అలవాటు అయితే కరవాలనం (Shake hand) వేసిన తరువాత చెయ్యిని వదలకుండా నలిపేసే అలవాటు కొంత మందికి వుంటుంది. ఇటువంటి వారితో కరవాలనం వేసేకంటే రెండు చేతులతో నమస్కారం పెట్టి వెంటనే ఏదో ఒక వస్తువును రెండు చేతులతో పట్టుకోవడం మంచిది. ఎందుకంటే ఈ అలవాటును నయం చేసుకోవటం వారి చేతిలోనే వుంది కాని మన చేతిలో లేదు. అలాగే చేతిని శరీరంపై ఎక్కడెక్కడో తరుచుగా పెట్టుకుంటూ వుంటారు— మరికొందరు. ఇది చూడటానికి అభ్యంతరంగానూ, అసభ్యంగానూ వుంటుంది.

## అలవాట్లు—హిప్నాటిజం

ఇటువంటి అలవాట్లు వున్నవాళ్ళు సమాజంలో ఒక్కొక్కసారి నవ్వులపాలవుతారు. ఆత్మవిశ్వాసంతో అలవాట్లు మానుకోవాలి. హిప్నాటిజం ద్వారా నయం చెయ్యవచ్చు. హేండ్ లాకింగ్ సజెషన్ ద్వారా కొన్ని అలవాట్లు మాన్పించవచ్చు. ఈ అలవాట్లకు వ్యతిరేకంగా సబ్ కాన్షస్ మైండ్‌లో సజెషన్లు ఇస్తే తప్పకుండా ఈ అలవాట్లు మానివేయగలుగుతారు. ఇటువంటి బలహీనతలకు, మానరిజంలకు దూరమవటం వల్ల అగచాట్లు తప్పుతాయి. ఇవన్నీ సైకో సొమాటిక్ సమస్యలే. రోజూ ప్రశాంతంగా కూర్చుని ఈ అలవాటు మానుకోవాలి. వీటివల్ల నష్టం జరుగుతుంది అనుకుని ఒక్కోసారి చేతి పిడికిలి బిగించి, నెమ్మదిగా వదలాలి. ఈ విధంగా అయిదారుసార్లు చేస్తే మంచి ఫలితం వుంటుంది. నయం కాకపోతే హిప్నాటిజం ద్వారా మంచి ఫలితం పొందే అవకాశం చాలా వుంది.

### ముష్టిస్నానం

మొదటి ముష్టివాడు: ముప్పయి రోజులుగా స్నానం చేయకుండా ఎలా ఉంటున్నావురా?''

రెండో ముష్టివాడు: ఏం? నువ్వుండలేవా?

మొదటి ముష్టివాడు: ఏమో బాబూ! నాకయితే 29 రోజులకే మహా చిరాగ్గా వుంది.

— టి. శ్రీనివాసరావు, హైదరాబాద్.

### థాంక్స్

''హలో... శంకర్రావ్‌గారేనా?! మీ ఆవిడని మేమే కిడ్నాప్ చేశాం...''

''చాలా థాంక్స్!... కనీసం రెండురోజులన్నా మీ దగ్గరుంచికోండి... నేను విశ్రాంతి తీసుకోవాలి.''

# అమ్మకానికో గ్రహం

భూమికి కొన్నివేల మైళ్ళ దూరంలో తెల్లగా మండుతూ, కాంతులీనే ''నక్షత్ర వాహన నౌక'' నిలిచి ఉంది.

నక్షత్రవాసి నెమ్మదిగా తన బంగారు రంగు గడ్డాన్ని నిమురుతూ ఇలా అన్నాడు. ''మీ సందేహాలను, అనుమానాలను అర్థం చేసుకోగలను కాని మీకు అపకారం తలపెట్టే ఉద్దేశ్యం మాకు ఏ కోశానా లేదు. ఈ విశ్వంలోని అతి పెద్ద నక్షత్రాలలో నివసించే మేము మా ఆట స్థలాలంతైనా లేని మీ గ్రహాలను ఏం చేసుకుంటాం?''

గ్రహాంతరవాసుల విభాగం అధికారి (ఇతను భూమికి సైన్య కార్యదర్శి కూడా). కాని మీ ప్రధాన వర్తక రహదారి మా గ్రహమండలం

**మూలం: అసిమోవ్ అనువాదం: మంజుపతి**

నుండి పోతుందని ఒప్పుకున్నారు కదా?' అన్నాడు.

'అవును. మా మిజ్జరెట్ ప్రపంచం ప్రోటోనిక్ ద్రవాన్ని తయారుచేయడం మొదలు పెట్టింది కాబట్టి'

'ఇక్కడ, భూమి మీద వర్తక రహదారులలో స్థావరాలు ఏర్పాటు సైనిక ప్రాముఖ్యాన్ని కలిగి ఉంటుంది. కాబట్టి మాకు నమ్మకం కుదరాలంటే జూపిటరు గ్రహం మీకు ఎందుకు అవసరమో చెప్పితీరాలి'.

నక్షత్రవాసి ఈ మాటలతో ముఖం ఇబ్బందిగా పెట్టాడు. 'ఇది రహస్యంగా ఉంచవలసిన విషయం. ఒక వేళ లాంబెర్జ్ వాసులకు తెలిస్తే—'

'మీ మాటలను బట్టి చూస్తే మీకు, లాంబెర్జ్‌కు మధ్య యుద్ధం వచ్చేట్లున్నది.'

'కాని మీకు బదులుగా చాలా ఎక్కువ మొత్తాన్ని ఇస్తున్నాం కదా! మీరు నివసిస్తున్న భూమి దగ్గరి గ్రహాలలో మాకు ఆసక్తిలేదు. మీరు ఎన్నడూ నివసించలేని జూపిటరునే అడుగుతున్నాం.' వ్యంగ్యంగా నవ్వుతూ 'అంత పెద్ద గ్రహం మీద మీరు నివసించలేరు'

సైన్య కార్యదర్శి కోపాన్ని అణిచిపెట్టుకుంటూ స్థిరంగా అన్నాడు 'త్వరలో మేము జోవిమన్ ఉపగ్రహాలను ఆక్రమించుకొని, నివాస స్థలాలుగా మార్చబోతున్నాం'

'మీ స్వంత ఉపగ్రహాలకు మేము ఏవిధంగానూ అడ్డురాము. కేవలం ఎందుకూ పనికిరాని జూపిటరు గ్రహాన్ని మాత్రమే అడుగుతున్నాం. తగిన ప్రతిఫలాన్ని ఇస్తున్నాం కూడా! తలుచుకుంటే మీ అనుమతి లేకుండా కూడా జూపిటరును ఆక్రమించుకోగలం. కాని ముందు ముందు ఏ ఇబ్బంది రాకుండా ఉండడానికి మాత్రమే చట్టపరమైన ఒప్పందాన్ని కోరుతున్నాం. అర్థమైంది అనుకుంటా?'

కార్యదర్శి మరింత పట్టుదలతో రెట్టించాడు 'మీకు జూపిటర్‌తో ఏం పని?'

'లాంబెర్జ్—'

'మీకు, లాంబెర్జ్‌కు మధ్య యుద్ధం జరుగుతున్నదా?'

'అదికాదు—'

'మీరు జూపిటరు మీద సైనిక స్థావరాన్ని ఏర్పాటు చేసుకుంటే, లాంబెర్జ్ వాసులు కలిసి మామీద దాడి చేస్తారు మీకు అనుమతి ఇచ్చినందుకు. మీ ఇద్దరి మధ్య గొడవల్లోకి మేము రాదలుచుకోలేదు'

'నన్ను నమ్మండి మీకే హాని జరుగదు. ప్రతీ సంవత్సరం మీకు సరిపడినన్ని విద్యుత్ పెట్టెలు సరఫరా చేస్తాం'

'భవిష్యత్ విద్యుత్తు వినియోగాన్ని కూడా మీరు తీరుస్తానంటే'— నక్షత్రవాసి దీర్ఘంగా నిట్టూర్చుస్తూ 'సరే' ఇప్పటికంటె అయిదురెట్లు ఎక్కువగా సరఫరా చేస్తాం' అన్నాడు.

'చూడండి! నేను ప్రభుత్వాధికారినేకాని అధినేతను కాదు. మీరు జూపిటర్ ఎందుకు కావాలో నిజాయితిగా చెప్తే నేను మా ప్రభుత్వాన్ని, ప్రజలను ఒప్పించడానికి ప్రయత్నిస్తాను. నాకు నేనుగా మీతో ఒప్పందానికి వస్తే, భూమి

ఆ ఒప్పందాన్ని ఖాతరు వేయదు. ఆ తర్వాత మీ ఇష్టం.'

'సరే అయితే! మీకు ఈ రహస్యం చెప్పక తప్పేటట్టు లేదు. కాని ఈ విషయం బట్ట బయలు వేయనని మాటియ్యగలరా?'

'భూమి మీద ప్రమాణం వేసి చెబుతున్నాను'

★ ★ ★

సైన్సు కార్యదర్శి ఉత్సాహంగా ఉన్నాడు 'అధ్యక్షుని అనుమతి తీసుకున్న వెంటనే జపిటరును ఉపయోగించుకోవచ్చునని మిజ్జరెట్ (నక్షత్ర)వాసితో చెప్పాను. అధ్యక్షుడుగాని, కాంగ్రెస్‌కాని దేనికి అడ్డు చెప్పరనుకుంటా. ఆలోచించండి ఎంత లాభమో! మనం ఎన్నడూ ఉపయోగించలేని గ్రహానికి బదులుగా సరిపోయినన్ని విద్యుత్ పెట్టెలు ఉచితంగా పొందుతాం.'

రక్షణ కార్యదర్శి ఎర్రబడ్డ ముఖంతో కోపంగా తన అభిప్రాయాన్ని ప్రకటించాడు. 'మిజ్జరెట్—లాంబెర్జ్‌ల మధ్య యుద్ధం వల్లనే వాళ్ళు జూపిటరు గ్రహాన్ని అడుగుతున్నారు. వాళ్ళ సైన్యాన్ని దృష్టిలో ఉంచుకొని మనం తటస్థంగా ఉండటమే మంచిది.

సైన్సు కార్యదర్శి తన సహనాన్ని కోల్పోకుండా నెమ్మదిగా వివరించసాగాడు. 'ఎట్టి పరిస్థితులలోనూ యుద్ధం వచ్చే ప్రసక్తిలేదు. ఎందుకంటే వాళ్ళు జూపిటర్‌ని అడిగేది వేరే అవసరం గురించి కాబట్టి. అది వింటే అధ్యక్షుడే కాదు, మీకు కూడా అంగీకరిస్తారు. త్వరలో మీరు కొత్త జూపిటర్‌ను చూస్తారు.'

గుసగుసలతో ఆ కాన్ఫరెన్సు హాలులోని వారందరూ లేవారు. 'కొత్త జూపిటరా?' సంభ్రమాశ్చర్యాలతో ప్రశ్నించాడు రక్షణ కార్యదర్శి.

'కొత్తదంటే పూర్తిగా కొత్తది కాదు' అంటూ రెండు ఫోటోలను టేబుల్ మీద ఉంచాడు. మొదటి ఫోటోలో నల్లటి బ్యాక్‌గ్రౌండ్ మీద పసుపు, ఆకుపచ్చ చారికలతో జూపిటరు గ్రహం ఉంది. రెండో ఫోటోలో జూపిటరు చుట్టూ అత్యంత కాంతివంతంగా ప్రకాశిస్తున్న నారింజ రంగు వలయం ఉంది. ఆ నారింజరంగు వలయం జూపిటర్‌తో పాటుగా తిరగదు. అది స్థిరంగా ఉంటుంది' అన్నాడు సైన్సు కార్యదర్శి.

'ఆ వలయం ఏమిటి?' ప్రశ్నించాడు వాణిజ్య కార్యదర్శి.

'చూడండి! నక్షత్రవాసుల ప్రధాన వాణిజ్య రహదారుల్లో మన గ్రహమండలం కూడా ఉంది. రోజుకు కొన్ని వేల నక్షత్ర వాహక నౌకలు ఈ మార్గం కుండా ప్రయాణిస్తాయి. ఆ నౌకల్లోని ప్రయాణికులు తప్పకుండా టెలిస్కోపుల ద్వారా విచిత్రంగా బంతిలాగా కనబడే జూపిటరును కుతూహలంతో చూస్తారు. దానితోపాటే నారింజరంగు వలయం కూడా. ఆ వలయం నక్షత్రవాసుల లిపి. దానిని మన భాషలోకి తర్జుమా చేస్తే ఇలా ఉంటుంది. "మీ ఆరోగ్యానికి, ఉత్సాహానికి మిజ్జరెట్ ఎగ్గోన్ మాత్రలనే ఎల్లప్పుడూ వాడండి"

'అంటే జూపిటరు గ్రహాన్ని అడ్వర్టైజింగ్ బోర్డులాగా ఉపయోగిస్తారా' తన సందేహాన్ని వెలిబుచ్చాడు రక్షణ కార్యదర్శి.

'అవును. మిజ్జరెట్ వాసులు తయారుచేసే ఎగ్గోన్ మాత్రలనే లాంబెర్జ్ నక్షత్రవాసులు కూడా తయారుచేస్తున్నారు. అందుకే వాళ్ళ మధ్య పోటీ!

'లాంబెర్జ్ వాసులు కూడా అడిగితే—?'

'అడిగి తీరుతారు. శనిగ్రహం ఎలాగూ ఉందిగా. దాని చుట్టూ ఉన్న రింగులతో సహా ఇచ్చేద్దాం.'

'చాలా ఎక్కువ ధరకు' నవ్వుతూ కలిపాడు భూమి కోశాధికారి.

ఆ హాలంతా నవ్వులతో దద్దరిల్లిపోయింది.

●

చూసి ఇవచ్చుగా

"ఒరేయ్ గిరి! నీకు నేను 10 రూ.లు ఇచ్చాను అనుకో... అందులోంచి 3 రూపాయల 70 పైసలు తిరిగి తీసేసుకున్నాను అనుకో... నీ దగ్గర ఎంత వుంటుంది?" అడిగారు లెక్కలు మాస్టారు.

"ఆ ఇచ్చేది ఏదో 6 రూ. 30 పైలు ఇవ్వచ్చుగా!" వెనక బెంచినుంచి అరిచాడు ఓ గడుగ్గాయి.

ఎక్కడికి?

"హలో!... సరోజనేనా? నిన్ను గాఢంగా ప్రేమిస్తున్న ఓ ప్రేమికుడిని."

"నిజంగానా!?"

"నిజంగానే... కావాలంటే చెప్పు ఎక్కడికి రమ్మన్నా వస్తాను నీ ప్రేమ కోసం."

"అయితే అడ్రస్ ఇవ్వు... నా పెళ్ళికి శుభలేఖ పంపిస్తా అప్పుడు వద్దువుగాని..."

—సాయిగంగాధర్ చామర్తి

